సాక్షి
చిత్తూరు

గురువారం । 8 । జూన్ । 2023



పంట పొలాలపై ఏనుగుల దాడి

పులిచెర్ల, రామకుప్పం మండలాల్లోని మామిడి తోటలపై రెండు రోజులుగా ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. - 8లో



నిర్వహణ సక్రమంగా లేదు

పంచాయతీరాజ్ విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ కార్యాలయ నిర్వహణ సక్రమంగా లేదని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	39	28
తిరుపతి	41	28
తిరుమల	36	24
గూడూరు	42	31
నగరి	41	29

న్యూస్‌రీల్

సర్వీసుల తనిఖీ

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో మంగళ వారం సాయంత్రం నుంచి బుధవారం రాత్రి వరకు ట్రాన్స్‌కో 8 డివిజన్ల పరిధిలోని మొత్తం 3,307 సర్వీసులు తనిఖీ చేశారు. తిరుపతి ఆపరేషన్, తిరుపతి రూరల్, పుత్తూరు, చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్, మదనపల్లె, పీలేరు, పుంగనూరు పరిధిలో విద్యుత్ చౌర్యం, అపరాధరుసుం పరంగా మొత్తం 527 సర్వీసులకు రూ.11.64 లక్షలు అపరాధ రుసుం, జరిమానా రూపంలో చెల్లించాలని నోటీసులు ఇచ్చినట్లు ఎస్ఈ కృష్ణారెడ్డి వివరించారు.

నేడు ఎంపీపీ, వైస్ ఎంపీపీ-2 ఎన్నిక

రామకుప్పం: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో గురువారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ, వైస్ ఎంపీపీ-2 ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధాకృష్ణ తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ పురుషోత్తం ఎన్నికల అధికారిగా వ్యవహరించనున్నట్లు తెలిపారు. ఎన్నికల అధికారి సమక్షంలో ఎన్నికలు జరుగుతుందన్నారు. ఈ ఎన్నికలకు మండలంలోని ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలని కోరారు.

శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి



వ్రతాన్ని నిర్వహిస్తున్న అర్చక వేదపండితులు

కాణిపాకం(యాదమరి):కాణిపాక శ్రీ వరసిద్ది వినాయక స్వామి ఆలయంలో బుధవారం అర్చక వేదపండితులు శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి గణపతి వ్రతంను నిర్వహించారు. పౌర్ణమి తరువాత నాలుగో రోజు ఆలయంలో సంకటహర చతుర్థి గణపతి వ్రతం నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలను ఆలయ అధికారులు, అర్చక వేదపండితులు ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామివారి ఆస్థాన మండపంలో కొలువు తీర్చి పూజలు చేశారు. అనంతరం ఉదయం, సాయంత్రం ఆలయ అర్చక వేదపండితులు స్వామివారి సంకటహర చతుర్థి గణపతి వ్రతం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు రవీంద్ర బాబు, విద్యాసాగర్ రెడ్డి, పాల్గొన్నారు.

నేడు పోలీసు భవన సముదాయం ప్రారంభం

చౌడేపల్లె: మండల కేంద్రంలోని దొరబావితోట వద్ద రూ.1.60 కోట్లతో నిర్మించిన సర్కిల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ సముదాయంను గురువారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ బుధవారం కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లద్దిగంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆర్వో ప్లాంట్, కాటిపేరిలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళశాల నిర్మాణానికి భూమిపూజ చేసి, బహిరంగ సభలో మంత్రి పెద్దిరెడ్డి ప్రసంగించనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, మండల సచివాలయ కన్వీనర్ రుక్మిణమ్మ, మాజీ ఎంపీపీ అంజిబాబు, ఎంపీడీఓ సుధాకర్ సింగిల్ విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి ఉన్నారు.

ఆనందం.. శాశ్వతం



రాజకీయాల్లో నాయకులు వస్తుంటారు.. పోతుంటారు. కొందరే విలువలతో కూడిన రాజకీయాలు చేస్తుంటారు.. నిబద్ధతతో హామీలు ఇస్తుంటారు.. వాటిని నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తుంటారు.. దిగ్గజ నేతలుగా చరిత్రలో మిగిలిపోతుంటారు. అలాంటి మహానాయకులు చూపిన బాటలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పయనిస్తున్నారు. ఇచ్చిన మాటను తప్పకుండా.. వెనకడుగు వేయకుండా సంక్షేమ పాలన సాగిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం నిర్వహించిన కేబినెట్ సమావేశంలో మరో అడుగు ముందుకు వేశారు. ఒప్పందం పేరుతో చిన్నబోయిన ఉద్యోగులను క్రమబద్ధీకరించి వారిలో నూతనోత్తేజం నింపారు. సీపీఎస్ పేరిట తల్లడిల్లుతున్న ప్రభుత్వోద్యోగులకు జీపీఎస్ ప్రకటించి వారి జీవితాల్లో వెలుగులు తీసుకువచ్చారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఒకే నినాదం మార్మోగుతోంది. మాటిస్తే.. తప్పడంతే అంటూ ప్రజల్లో హర్షాతిరేకం వ్యక్తమవుతోంది.



- హామీల అమలులో సీఎం జగన్ మరో ముందడుగు
- కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు గ్రీన్‌సిగ్నల్
- సీపీఎస్ రద్దు చేస్తూ నిర్ణయం
- పాత పింఛన్‌కు సమానంగా ఏపీ జీపీఎస్
- హెచ్‌ఆర్‌ఏ పెంపుపై ఉద్యోగుల హర్షం

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఎంప్లాయీస్‌కి వైఎస్సార్‌సీపీ సర్కార్ తీపి కబురు వినిపించింది. ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న ఒప్పంద ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మొత్తం 1,998 మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల కల నెరవేర్చింది. ఈ మేరకు ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బందికి రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా అన్ని సదుపాయాలను వర్తించనున్నారు. అలాగే పాత పింఛన్‌కు సమానంగా ఉండేలా గ్యారెంటీ పెన్షన్ స్కీమ్‌ను అమలు చేసేందుకు మంత్రి వర్గం ఆమోదం లభించింది. జిల్లాలోని మొత్తం 44,377 మంది ఉద్యోగులకు అరియర్స్‌తో 2.73 శాతం డీఏ వర్తింపజేయనుంది. అలాగే జిల్లా కేంద్రాల్లో పనిచేసే ఉద్యోగులకు 12 శాతం నుంచి 16 శాతం హెచ్‌ఆర్‌ఏ పెంచడంతో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని దాదాపు 12 వేలకు పైగా ఉద్యోగులకు మేలు చేకూరుస్తోంది.

మా బతుకుల్లో వెలుగు



యాదమరి పీహెచ్‌సీలో 20 ఏళ్లుగా హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాను. ఇన్నాళ్లు మమల్ని పట్టించుకునే వారు లేరు. జగనన్న మా బతుకులకు వెలుగునిచ్చారు. సంతోషం పట్టలేకున్నాం.
– సతీష్‌కుమార్, కాంట్రాక్ట్ ఉద్యోగి, యాదమరి

ఉద్యోగులకు తీపికబురు



ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు చెప్పడం ఆనందంగా ఉంది. కొత్త పీఆర్‌సీ ఏర్పాటు, అరియర్స్‌తో పాటు 2.73 శాతం డీఏ, జిల్లా కేంద్రాల్లో పనిచేసే వాళ్లకు 12 నుంచి 16 శాతం హెచ్‌ఆర్‌ఏ ఇవ్వడం ఆనందదాయకం. ఈ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాం. – హుస్సేన్, రెవెన్యూ సంఘం జిల్లా కార్యదర్శి, చిత్తూరు

సంతోషంగా ఉంది



ఉద్యోగులకు మేలు కలిగేలా హెచ్‌ఆర్‌ఏ పెంచడం సంతోషంగా ఉంది. ఆలస్యంగా అయినా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల ఎంతో మంది ఉద్యోగులు లబ్ధి పొందనున్నారు. ఉద్యోగులకు సంబంధించి రాష్ట్ర కేబినెట్‌లో తీసుకున్న ఆమోదాలపై ఉద్యోగుల తరపున హర్షం వ్యక్తం చేస్తున్నాం.
– నరేష్‌బాబు, ట్రెజరీ శాఖ ఉద్యోగి, చిత్తూరు

ఉద్యోగులు మేలు



కేబినెట్‌లో ఉద్యోగులకు మేలు కలిగే నిర్ణయాలను ప్రభుత్వం తీసుకోవడం శుభపరిణామం. ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏ 12 నుంచి 16 శాతానికి పెంచడం వల్ల ఉద్యోగులకు మేలు కలుగుతుంది. ఈ నిర్ణయం పట్ల జిల్లా ఎన్జీవో సంఘం తరపున ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నాను.
– రాఘవులు, ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షులు

ఆనందంగా ఉంది



కాంట్రాక్టు ఉద్యోగులకు తీపికబురు చెప్పినందుకు ఆనందంగా ఉంది. ఎన్నో సంవత్సరాలుగా ఒకే వృత్తినే నమ్ముకుని పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు చాలా కాలం తరువాత మేలు జరిగింది. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించినందుకు సర్కారుకు రుణపడి ఉంటాం.
– ఉమాపతి, కాంట్రాక్ట్ లెక్చరర్, పెనుమూరు

కల నెరవేరింది



మండల విద్యాశాఖ కార్యాలయంలో మెసెంజర్‌గా రూ.700 నుంచి పని చేస్తున్నా. గతంలో ఏ ప్రభుత్వమూ పట్టించుకోలేదు. అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి మాలాంటి వారిని క్రమబద్ధీకరించడం ఆనందంగా ఉంది. నా 23 సంవత్సరాల కల నేటికి నెరవేరింది.
– ఎస్. రవిరెడ్డి, మెసెంజర్, ఎమ్మార్సీ, కార్వేటినగరం

గొప్ప విషయం



ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను శాశ్వత ప్రతిపాదికన తీసుకోవడం ఆనందం. ఇన్ని రోజులూ మాకు ఉద్యోగ భద్రత లేదు. దీనిపై గతంలో ఆందోళన కార్యక్రమాలు చేసినా ఫలితం లేదు. శాశ్వత ఉద్యోగులుగా తీసుకోవడానికి ఆమోదం తెలుపడం గొప్ప విషయం.
– రూప్‌కుమార్, సహాయ కార్యదర్శి, విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం

చెప్పారంటే చేస్తారు



ఏళ్ల తరబడిగా ప్రభుత్వాలు పట్టించుకోలేదు. జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రలో కాంట్రాక్టు ఉద్యోగులను రెగులర్ చేస్తామని హామీ ఇచ్చారు. చెప్పినా మాట ప్రకారం రెగులర్ చేశారు. చెప్పాడంటే చేస్తాడంతే. ఆయనకు జీవితాంతం రుణపడి ఉటాం.
– చంద్రప్ప, ప్రధాన కార్యదర్శి, జిల్లా కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం

మంచి నిర్ణయం



కాంట్రాక్టు ఉద్యోగులు పాతికేళ్లుగా రెగ్యులరైజ్ కోసం ఎదురుచూస్తున్నారు. వారిని రెగ్యులరైజ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎంతో గొప్పది. ఈ నిర్ణయం వల్ల వేలాది మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల కుటుంబాల్లో ప్రభుత్వం వెలుగులు నింపినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నాను.
– శివయ్య, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, జిల్లా అధ్యక్షులు

చరిత్రలో మహత్తర ఘట్టం



ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చరిత్రలో నిలిచిపోయే ఒక మహత్తర ఘట్టం. గతంలో ఏ నాయకులూ కాంట్రాక్టు ఉద్యోగులు సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదు. క్రమబద్ధీకరణ కోసం ఎదురు చూశారు. వారి ఉద్యోగాలకు సీఎం జగన్ భద్రత కల్పించడం ఎంతో సంతోషకరం
– గిరిప్రసాద్, రాష్ట్ర అధ్యక్షులు, పీఆర్‌టీయూ

నెరవేరిన కల



చాలా సంవత్సరాల నుంచి కాంట్రాక్టు ఉద్యోగులు క్రమబద్ధీకరణ కోసం ఎదురు చూస్తున్నారు. గతంలో ఎన్నో సార్లు అప్పటి పాలకుల వద్దకు తిరిగినా ఏ మాత్రం ఫలితం లేదు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించినందుకు కృతజ్ఞతలు.
– రెడ్డెప్పరెడ్డి, జిల్లా అధ్యక్షులు, కాంట్రాక్ట్ లెక్చరర్స్ ఫెడరేషన్

కొత్త పీఆర్‌సీ అభినందనీయం



కొత్త పీఆర్‌సీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అభినందనీయం. ఉద్యోగులందరికీ ఎరియర్స్‌తో పాటు 2.73 శాతం డీఏ వర్తింపజేయడం ఆనందదాయకం.
– బాలాజీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆపస్

రెవెన్యూ శాఖ ప్రతిష్ట పెంచాలి

- ప్రతి వారం నియోజకవర్గ కేంద్రంలో సదస్సు
- మొదటి సదస్సు కుప్పం నుంచే శ్రీకారం
- జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు



రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

కుప్పం: జిల్లాలో రెవెన్యూ శాఖ ప్రతిష్టను పెంచేలా రెవెన్యూ యంత్రాగం పనిచేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. కుప్పం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ స్థాయి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలోని రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి ప్రజలు అర్జీలు అందజేశారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు రెవెన్యూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి రెవెన్యూ సదస్సుల నిర్వహణకు శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ప్రతి బుధవారం నియోజకవర్గ కేంద్రంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. రెవెన్యూ శాఖలో అధికారుల తీరు మారాలని సూచించారు. ఈ సదస్సులో వచ్చిన అర్జీలను మూడు కేటగిరీలుగా విభజించనున్నారు. వీటిలో వారంలోపు, 15 రోజులు, 30 రోజుల్లోపు అన్ని పరిష్కరించాలని ఆయన తెలిపారు. మూడు కేటగిరీల్లో అర్జీల పరిష్కారం నిమిత్తం జిల్లా ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. రెవెన్యూ అధికారులు బాధ్యతగా సదస్సుల్లో వచ్చిన అర్జీలను పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. అనంతరం కుప్పం మోడల్ కాలనీ వద్ద జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని హౌసింగ్ శాఖ అధికారులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కుప్పం ఆర్డీవో శివయ్య, తహసీల్దార్లు పార్వతీ, కాలేష్, గురప్ప, మురళి పాల్గొన్నారు.

150 రెవెన్యూ ఫిర్యాదులు

మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 150 ఫిర్యాదులు అందాయి. వీటిలో రెవెన్యూ సమస్యలపై అధికంగా 76 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. వీటిని కేటగిరీల వారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని క్షేత్ర స్థాయి రెవెన్యూ అధికారులకు జాయింట్ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

బంగారు రథంపై వినాయకుడి విహారం



ఆలయ మాడవీధుల్లో బంగారు రథంపై ఊరేగుతున్న స్వామివారు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ది వినాయక స్వామి బుధవారం రాత్రి బంగారు రథంపై ఆలయ మాడవీధుల్లో విహరించారు. సంకటహర చతుర్థి గణపతి వ్రతం సందర్భంగా రాత్రి ఆలయంలోని కల్యాణ వేదికపై సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామిని కొలువుదీర్చి ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు నిర్వహించి పూజలు చేశారు. ఉత్సవమూర్తులను ఆలయ అధికారులు, ఉభయదారులు, ఊరేగింపుగా మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ తీసుకొచ్చి బంగారు రథంలో కొలువుదీర్చి పూజలు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం బంగారు రథాన్ని ఆలయ మాడవీధుల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, మేళతాళాలు, మంగళవాయిద్యాలతో ఊరేగించారు. భక్తులు స్వామివారికి కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, ఆలయ అధికారులు, ఉభయదారులు పాల్గొన్నారు.

నీటి బిల్లులు రూ.43.85 కోట్లు విడుదల


చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో జూలై 2019 నుంచి జూలై 2021 వరకు పెండింగ్‌లో ఉన్న తాగునీటి బిల్లులు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జిల్లాలో 12,445 ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. ఇందుకు సంబంధించి రూ.43.85 కోట్ల బిల్లులు పెండింగ్ ఉండటంతో ట్యాంకర్ల యజమానులు సమస్యను కలెక్టర్ షణ్మోహన్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు.

12న ఆత్మీయ సమ్మేళనం

పుంగనూరు: ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, క్రిస్టియన్, మైనార్టీల ఆత్మీయ సమావేశం ఈ నెల 12న పుంగనూరులో నిర్వహించనున్నట్లు సభ నిర్వాహకులు డాక్టర్ మునీంద్రనాయక్ బుధవారం తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక ఆర్‌ఆర్ కల్యాణ మండపంలో జరిగే ఈ సమ్మేళనానికి ఉమ్మడి జిల్లాలోని బడుగుబలహీన వర్గాల వారు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

చెంగాళమ్మ తిరునాళ్లలో నేడు బలిహరణ

- రేపు సుళ్లు ఉత్సవం



విద్యుద్దీపాలతో అలంకరించిన అమ్మవారి ఆలయం

సూళ్లూరుపేట: సూళ్లూరుపేటలో వెలసిన శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి బ్రహ్మోత్సవాలు గురువారం రాత్రి బలిహరణ కార్యక్రమంతో ప్రారంభం కానున్నాయి. చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారు కాళంగినది సుళ్లలో స్వయంభువుగా వెలసింది కాబట్టి అమ్మవారి తిరునాళ్లలో మొదటి మూడురోజులు సుళ్ల ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. గురువారం రాత్రి బలిహరణ అనంతరం శుక్రవారం ఉదయాన 7.45 గంటలకు సుడిమానును ప్రతిష్ట కార్యక్రమాన్ని జరుగుతుంది. సాయంత్రం 4 గంటలకు సుళ్ల ఉత్సవం నిర్వహించేందుకు అంతా సిద్ధం చేశారు. అమ్మవారు కాళంగినది సుళ్లలో దొరికిందనే నానుడి ఉన్నప్పటికీ అమ్మవారి విగ్రహం తడ మండలం గొల్లలములువు నుంచి తీసుకొచ్చి ఇక్కడ స్థాపించారనే కథనం కూడా ప్రచారంలో ఉండడంతో గొల్లలములువులోని తన పుట్టింటి వారు అయిన వేనాటి కుమారస్వామిరెడ్డి (పడమటింటివారు) ఇంటినుంచి వడిబాలు సారెను అట్టహాసంగా తీసుకొస్తారు. అలా అమ్మవారి పుట్టింటినుంచి వచ్చిన వడిబాలు సారె ఆలయంలో సమర్పించిన తరువాత సుళ్ల ఉత్సవం ప్రారంభమవుతుంది. చెంగాళమ్మ తిరునాళ్లలో సుళ్ల ఉత్సవానికి ప్రత్యేకత ఉంది. స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఈఓ శ్రీనివాసులురెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి తదితరులు ఉత్సవాల కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.

పులిగుండులో మెగా జాబ్‌మేళా



ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థులు

పెనుమూరు (చిత్తూరు అగ్రికల్చర్): నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని విదేశీ వ్యవహారాల రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పులిగుండు వద్ద ఏపీ స్కిల్ డెవలప్‌మెంటు, మహాసముద్రం ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళాను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిరుద్యోగులకు లక్షలాది ఉద్యోగావకాశాలు కల్పించారన్నారు. అనంతరం జాబ్ మేళాలో 20 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా 931 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు మహాసముద్రం ఫౌండేషన్ అధ్యక్షుడు యం.దయాసాగర్ రెడ్డి తెలియజేశారు.

పంట పొలాలపై ఏనుగుల దాడి

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని కల్లూరు టౌన్ సమీపంలో రెండు రోజులుగా మామిడి తోటలపై ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. రెండు రోజులపాటు మామిడి తోటల్లో చొరబడి ధ్వంసం చేశాయి. పంట చేతికొచ్చిన సమయంలో చెట్ల కొమ్మలను విరిచేస్తుండడంతో కాయలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

రామకుప్పం: మండలంలోని గడ్డూరు, యానాదికాలనీ గ్రామాల పరిధిలో మూడు ఏనుగులు పంటలపై దాడులు చేశాయి. టమాటా, మామిడితోట, బీన్స్ పంటలను మంగళవారం అర్ధరాత్రి ఏనుగుల గుంపు నాశనం చేశాయని స్థానిక రైతులు వాపోయారు.

వేసవిలో వన్యప్రాణులకు అండగా..



బొమ్మసముద్రంలో నీటి కుంటల్లో నింపుతున్న నీరు



యాదమరిలో నీరు నింపుతున్న ట్యాంకర్

- దాహార్తి తీర్చేలా అటవీశాఖ ప్రత్యేక చర్యలు
- విరివిగా నీటి తొట్టెలు చెక్‌డ్యామ్‌లు ఏర్పాటు

చిత్తూరు కార్పొరేషన్: అడవికి అందాలు వన్యప్రాణులే వాటిని సంరక్షించే బాధ్యత అందరిపై ఉంది. వేసవి వచ్చిందంటే చాలు నీరు, ఆహారం లభించక వన్యప్రాణులు జనారణ్యంలోకి రావడం, మృత్యువాత పడడం, అడవుల్లో అగ్ని మంటల్లో చిక్కడం లాంటి కారణాలతో అంతరించిపోయే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో వన్యప్రాణుల రక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అటవీశాఖ ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. వన్యప్రాణుల దాహం తీర్చడంతోపాటు అడవుల సంరక్షణకు విశేష కృషి చేస్తోంది.

దాహార్తి తీర్చడం ఇలా..

అడవుల్లో ఫైర్‌లైన్ ఏర్పాటు చేసి వృక్ష, జంతువులకు రక్షణ కల్పిస్తున్నారు. వన్యప్రాణుల సౌకర్యార్థం అదనంగా చెక్‌డ్యామ్‌లు, ఫారం పాండ్లు, సాసర్‌రింగ్స్ లాంటివి ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతూ వన్యప్రాణుల గొంతుతడుపుతున్నారు. కంపా నిధుల ద్వారా అడవుల సంరక్షణకు అటవీశాఖ తీసుకుంటున్న పనులు సత్ఫలితాలనిస్తున్నాయి. జిల్లాలోని 1.95 లక్షల హెక్టార్లలో అడవులు విస్తరించి ఉన్నాయి.

జిల్లాలోని 6 ఫారెస్ట్ రేంజ్‌ల పరిధిలోని 24 సెక్షన్లు, 84 బీట్ల పరిధిలో దాదాపు 40 నీటి తొట్టెలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా వన్యప్రాణులకు సమృద్ధిగా తాగునీరందిస్తున్నారు. వీటితో పాటు 120 చెక్‌డ్యామ్‌లకు, 294 నీటి కుంటల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు చెబుతున్నారు. అగ్ని ప్రమాదాల నివారణకు రూ.81 లక్షలు నిధులు మంజూరు చేయగా అందులో రూ.41 లక్షలు ఖర్చు చేశారు. అడవుల ప్రాముఖ్యతపై ప్రతి ఒకరిలోను అవగాహన అవసరం. వేసవిలో కార్చిచ్చుబారిన పడి అటవీ సంపద బుగ్గిపాలవుతోంది. ఈ క్రమంలోనే సమీపాన ఉన్న ప్రజలకు అడవుల సంరక్షణ, ప్రాముఖ్యతపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. కాపరులను కేవలం పశువుల మేతకు మాత్రమే అనుమతిస్తున్నారు. ఇతరులను అడవుల్లోకి వెళ్లనీకుండా అడ్డుకుంటున్నారు. అటవీ సంపద మంటలపాలు కాకుండా ఫైర్‌లైన్ల నిర్వహణపై దృష్టి పెట్టారు. అడవుల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే శాటిలైట్ ద్వారా వచ్చే మెసేజ్ అలర్ట్‌తో ఆ ప్రాంతానికి చేరుకుని మంటను నివారించేలా 46 కిలోమీటర్లు ఫైర్‌లైన్లను అందుబాటులో ఉంచారు. జిల్లాలోని ఫారెస్ట్ ప్రాంతాల్లో వన్యప్రాణులు స్వేచ్ఛగా సంచరిస్తున్నాయి. దుప్పులు, కుందేళ్లు, అడవిపందులు, జింకలు, నెమళ్లు, పక్షులు ఎక్కువగా ఉన్నాయి. జగనన్న పచ్చతోరణంలో భాగంగా జంతువులు, పక్షుల కోసం ఎక్కువగా నేరేడు, ఉసిరి, మారేడు, వెలగ, చింత, వేప, రావి, మర్రివంటి పండ్ల మొక్కలను నాటి సంరక్షిస్తున్నారు. మరిన్ని ప్రాంతాల్లో ఎర్రమద్ది, నల్లమద్ది వంటి విత్తనాలను సేకరించే పనిలో అధికారులు ఉన్నారు.

బాధ్యత అందరిదీ



అడవిలోని వన్యప్రాణుల సంరక్షణ బాధ్యత అందరిది. అడవుల విస్తరణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. పలు రకాల మొక్కలను పెంచడానికి కృషి చేస్తున్నాం. అడవులు, వన్యప్రాణులకు ముప్పు కల్గిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. జంతువులను వేటాడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

– చైతన్యకుమార్‌రెడ్డి, డీఎఫ్‌ఓ



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,500
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.72,000
రిటైల్ వెండి గ్రాము	రూ.75

బాల కార్మికుల గుర్తింపు



దుకాణదారుడిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జిల్లా కార్మికశాఖాధికారి ఓంకార్‌రావు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో కార్మికశాఖ, టాస్క్‌ఫోర్స్‌ల ఆధ్వర్యంలో బుధవారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. పాతబస్టాండ్, చర్చివీధి, ఎంఎస్ఆర్ సర్కిల్, ఓటీకే రోడ్డు, పొన్నియమ్మన్ గుడివీధి, వేలూరురోడ్డులోని ఉన్న దుకాణాలను పరిశీలించారు. చర్చివీధిలోని ఓ దుకాణంలో ఇద్దరు బాలకార్మికులు పనిచేస్తుండటాన్ని గుర్తించి జిల్లా కార్మిక శాఖాధికారి ఓంకార్‌రావు యజమానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టపరంగా దుకాణదారుడిపై కేసు నమోదు చేసి, జరిమానా విధించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పిలిపించి పిల్లలను అప్పగించారు. కలెక్టర్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 30 వరకు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎల్‌ఎం జగదీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

భర్త తిరిగి రాలేదని ఆత్మహత్యాయత్నం

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని లక్ష్మీనగర్ కాలనీకి చెందిన మౌనిష (25) అనే వివాహిత బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వన్‌టౌన్ సీఐ భాస్కర్ కథనం మేరకు.. సత్యవేడుకు చెందిన మౌనిషకు దామలచెరువుకు చెందిన సురేష్‌బాబుకు పెళ్లయి ఆరేళ్లు కావస్తోంది. గత కొంత కాలంగా ఇద్దరు పిల్లలతో కలిసి చిత్తూరులోని లక్ష్మీనగర్ కాలనీలో కాపురముంటున్నారు. సివిల్ కాంట్రాక్టర్‌గా ఉన్న సురేష్‌బాబు తెలంగాణలోని సిరిసిల్లకు వెళ్లి మూడు నెలలు కావస్తోంది. ఇంతవరకు ఇంటికి రాలేదు. దీంతో మనస్తాపం చెందిన మౌనిష ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు గుర్తించి ఈమెను చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఇక్కడి నుంచి సీఎంసీకు తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.


ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న లారీ



మృతుడు ప్రభాకర్

బంగారుపాళెం: మండలంలోని మహాసముద్రం టోల్ ప్లాజా వద్ద బుధవారం ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో తండ్రి మృతి చెందగా కుమార్తె గాయపడినట్లు ఏఎస్ఐ మల్లప్ప తెలిపారు. మండలంలోని తూంపాయనపల్లెకు చెందిన ప్రభాకర్(47), కుమార్తె శృతి ద్విచక్ర వాహనంపై చిత్తూరులోని బంధువుల ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యంలో మహాసముద్రం టోల్ ప్లాజా సమీపంలో ద్విచక్రవాహనాన్ని పలమనేరు నుంచి చిత్తూరు వెళ్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రభాకర్, శృతి తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీకి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతదేహానికి బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మల్లప్ప తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య



మృతి చెందిన సుబ్రమణ్యం

వి.కోట: వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మృతి చెందిన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు మండలంలోని పత్రపల్లెకు చెందిన సుబ్రమణ్యం (55) తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రసాద్‌బాబు తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు అబ్బాయిలు ఉన్నారు.


టైరు పేలి కారు బోల్తా



బోల్తా పడిన కారు

పూతలపట్టు: టైరు పేలి కారు బోల్తా పడిన ఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. బెంగళూరుకు చెందిన ముగ్గురు వ్యక్తులు కారులో బుధవారం తిరుపతిలోని ఇస్కాన్ మందిరాన్ని దర్శించుకుని బెంగళూరుకు తిరుగు ప్రయాణమయ్యారు. మార్గం మధ్యలో పూతలపట్టు మండలం రంగంపేట క్రాస్ వద్ద ముందు టైర్లు పేలడంతో కారు రోడ్డు పక్కకు దూసుకెళ్ళి బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా బయటపడినట్లు స్థానికులు తెలిపారు.

ఆక్రమణలను అడ్డుకున్న సిబ్బంది



ఆక్రమణ భూమిని పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

శ్రీరంగరాజపురం : మండలంలో భూ ఆక్రమణలను బుధవారం రెవెన్యూ సిబ్బంది అడుకున్నారు. మండల పరిధిలోని కోటరాళ్లపల్లి రెవెన్యూ సర్వే నంబర్ 155/01లో రెండెకరాల 45 సెంట్లు డీకేటీ భూమి చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారి ఆనుకుని ఉంది. ఈ భూమిని ఆక్రమించి 49 కొత్తపల్లిమిట్టకు చెందిన సూరి రెడ్డి, శ్రీను కలిసి ప్లాట్లు వేసి విక్రయించడం ఆరంభించారు. ఈ సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు బుధవారం ఆ ఆక్రమణలను అడ్డుకున్నారు. దీంతో వారు రెవెన్యూ సిబ్బందిని దూషిస్తూ, దాడికి యత్నించారు. వెంటనే వీఆర్వో తహసీల్దార్ లోకనాథపిళ్లై కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్ఐ షేక్షావలీ విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

స్పేస్ ఒలింపియాడ్‌లో ఎలెన్ విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న డాక్టర్ ఫణి

తిరుపతి ఎడ్యుకేషన్ : నాసా నిర్వహించే ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ స్పేస్ ఒలింపియాడ్ పరీక్షలో తిరుపతిలోని ఎలెన్ కెరియర్ ఇన్‌స్టిట్యూట్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థి నిమై కర్మ్కార్ ప్రిలిమినరీ లెవెల్‌లో ఉత్తీర్ణుడై ఇంటర్మీడియట్ లెవెల్‌కి అర్హత సాధించినట్లు ఆ సంస్థ తిరుపతి హెడ్ డాక్టర్ ఫణి తెలిపారు. మూడు దశల్లో జరిగే ఈ పరీక్ష ప్రిలిమినరీ లెవెల్ మే 13, 14వ తేదీల్లో నిర్వహించినట్లు తెలిపారు. మన రాష్ట్రంలో అర్హత సాధించిన కొంత మందిలో నిమై ఒకడని తెలిపారు. నిమై ఎనిమిదో తరగతి నుంచి తిరుపతి ఎలెన్ కెరియర్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఒలంపియాడ్ ప్రోగ్రామ్ వివరాలకు 99000 70050లో, అలాగే తిరుపతి ఏఐఆర్ బైపాస్ రోడ్డులోని తమ సంస్థను సంప్రదించాలని తెలిపారు.

కౌన్సెలింగ్‌లో అన్ని ఖాళీలు చూపాలి



డీఈవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఫ్యాప్టో నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్ల బదిలీల కౌన్సెలింగ్‌లో అన్ని ఖాళీలు తప్పనిసరిగా చూపించాలని ఫ్యాప్టో నాయకులు డిమాండ్ చేశారు. ఆ సంఘ నాయకులు బుధవారం డీఈవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పాల్గొన్న ఫ్యాప్టో నాయకులు గంటామోహన్, జీవీ రమణ, ముక్తార్ అహ్మద్ మాట్లాడుతూ జీవో నెంబర్ 117 సవరించకుండా వేలాది టీచర్ పోస్టులు రద్దయ్యే విధంగా చేపడుతున్న బదిలీల వల్ల సమస్యలున్నాయన్నారు. ఖాళీలను బ్లాక్ చేయడం వల్ల టీచర్లకు నష్టం కలుగుతుందని చెప్పారు. పూటకొక సవరణతో గందరగోళానికి గురిచేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

వేడుకగా ప్రసన్న వేంకటేశ్వరుని రథోత్సవం



అశ్వ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

వడమాలపేట : అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు రథోత్సవం వేడుకగా నిర్వహించారు. బుధవారం ఉదయం స్వామి వారిని మేల్కొలిపి నిత్యపూజా కైంకర్యాలు పూర్తి చేశారు. శుద్ధి, తోమాలసేవ, అర్చన, కొలువు, మొదటిగంట, శ్రీవారి అమ్మవారి అభిషేకం, అలంకరణ, విశేషనివేదన, కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీవారి వాహన మండపం, వేంచేపు, పుణ్యాహవచనము, నవగ్రహారాధన దానము నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తిని పట్టు పీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి రథంపై కొలువుదీర్చి వేదోక్తంగా దీపధూప నైవేద్యాలు సమర్పించారు. రథోత్సవం ముందు స్వామి వారికి నవగ్రహపూజ నిర్వహించి వేంకటేశ్వర స్వామికి నవగ్రహదానం చేశారు. రథాగమనం ఉదయం 6.25 నుండి 7 గంటల వరకు నిర్వహించారు. స్వామి వారు రథంపై మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. స్వామి అమ్మవార్లకు వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనే, చందనం, పసుపు, కొబ్బరి నీళ్ళతో అభిషేకం చేశారు. సాయంత్రం శుద్ధి, రాత్రి కైంకర్యములు నిర్వహించారు. రాత్రి 7 గంటల నుంచి 8 గంటల వరకు ప్రసన్న వేంకటేశ్వర స్వామి అశ్వవాహనంపై మాడవీధుల్లో ఊరేగుతూ కనువిందు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, టెంపుల్ సూపరింటెంట్ శ్రీవాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఆలయ అర్చకులు సూర్యకుమారాచార్యులు, తిప్పాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నగరి : డాక్టర్ వైఎస్సార్ సంచార పశువైద్యశాలలో ఒప్పంద ప్రాతిపదికన పశువైద్యులు, వెటర్నరీ టెక్నీషియన్లు, డ్రైవర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పశుసంవర్ధకశాఖ ఏడీ వాసు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులు ఈ నెల 7న చిత్తూరు జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయానికి రావాలని పేర్కొన్నారు. వివరాలకు 9908584874, 91549 70184 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

నిర్వహణ సక్రమంగా లేదు



క్వాలిటీ కంట్రోల్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: పంచాయతీరాజ్(పీఆర్)విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ కార్యాలయ నిర్వహణ సక్రమంగా లేదని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. చిత్తూరు డివిజన్ గ్రామీణ నీటి సరఫరాశాఖ, పీఆర్ విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ కార్యాలయాలను సీఈఓ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్వాలిటీ కంట్రోల్ కార్యాలయ నేమ్‌బోర్డు చిరిగిపోయి ఉన్నా ఎందుకు మార్చలేదని ప్రశ్నించారు. పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడం సరికాదన్నారు. ల్యాబ్‌లో ఉన్న పరికరాల నిర్వహణ అధ్వానంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరికరాల భద్రతపై శ్రద్ధలేకపోవడం, వస్తువులు ఎక్కడ పడితే అక్కడ పడివేయడం ఏమిటని ప్రశ్నించారు. సిబ్బంది సక్రమంగా విధులకు హాజరుకావడం లేదని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న తాగునీటి బిల్లుల మొత్తం వచ్చాయని వాటిని వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డివిజన్ తాగునీటి సరఫరాశాఖ అధికారులను ఆదేశించారు. బిల్లుల అప్‌లోడ్ కోసం జెడ్పీ పరిధిలోని 22 మంది సిబ్బందిని ప్రత్యేకంగా నియమించామన్నారు. వారి పనితీరుపై పరిశీలనకు వచ్చి జిల్లా గ్రామీణ నీటిసరఫరాశాఖ ఎస్ఈ శంకర్‌బాబుతో పలు అంశాలపై మాట్లాడారు.